

రెప్పల మీద నీడలు

– అత్తలూరి విజయలక్ష్మి



(గత సంచిక తరువాయి)

16

పవిత్రకి హటాత్తుగా దుఃఖం వచ్చింది. నానమ్మా, అమ్మా తన దగ్గర ఉండకూడదా? వాళ్ళు రావాలంటే ఏదన్నా బలమైన కారణం ఉండాలా? తనకి వాళ్ళని చూడాలనిపిస్తోంది. ఈ పద్దెనిమిదేళ్ళ జీవితంలో వాళ్ళని విడిచి ఇంతకాలం ఉందా? వాళ్ళల్లో ఒక్కళ్ళు తన దగ్గర ఉన్నాఎంత ధైర్యంగా ఉంటుంది!

చీర కట్టుకోడం కూడా సరిగా రాని తను అప్పుడే ఒక ఇంటికి ఇల్లాలు. ఒక మగాడికి భార్య. ఈ రెండు పదవులకీ ఎన్నో బాధ్యతలు... ఎన్నో కర్తవ్యాలు. అవేవీ నేర్చుకోకుండానే పెద్దరికం తీసుకుంది.

అమ్మా, నాన్నలకి తెలియకుండా క్లాసులు డుమ్మా కొట్టి శివతో గడిపిన రోజులు ఎంత మధురంగా ఉండేవి! పెళ్లి తరవాత జీవితం ఇలా ఉంటుందని తెలిసి ఉంటే అసలు పెళ్ళే చేసుకునేది కాదు. పెళ్ళికాక ముందు ఈ బాధ్యతలు లేవు. వంట ఎలా చేయాలి? కూరలు ఎలా కోయాలి? ఇల్లు ఎలా సర్దుకోవాలి? ఇవేవీ తెలియదు. అన్నీ అమ్మ చేసి పెడుతుంటే, తుళ్ళుతూ, గెంతుతూ గడిపింది రోజులు.

"ఏంటి ఆలోచిస్తున్నావు?" శివ భుజాలు పట్టుకుని గట్టిగా కుదిపి అడిగాడు.

కళ్ళనిండా నీళ్ళతో అతని వైపు చూసి అంది. "నానమ్మకావాలి."

అతని మొహంలో రంగులు మారాయి. మొహం కఠినంగా అయింది. ఆ కళ్ళల్లో సీరియస్ నెస్ చూసి భయపడింది పవిత్ర.

"నువ్వేం చిన్నపిల్లని అనుకుంటున్నావా? నానమ్మ కావాలి అని ఐస్ క్రీం కావాలి అన్నంత ఈజీగా చెప్తున్నావు. ఆవిడని తీసుకొచ్చి, ఇక్కడ పెట్టుకుని నువ్వు సేవలు చేస్తావా?"

"నానమ్మకి నేను చేసేది ఏముంటుంది? ఆవిడే నాకు తోడుగా ఉంటుంది."

"అంటే! నీకు తోడుగా నేను లేనా?"

"మీరు హాస్పిటల్ కి వెళ్ళినపుడు ఒంటరిగా ఉంటాను కదండీ. అలవాటు లేదు నాకు." అంది జాలిగా.

శివ కోటు తొడుక్కుని, "నీకా బాధ ఉండదు. రేపు ఉదయానికి సరళ వస్తుంది" అన్నాడు.

"సరళా? అంటే!" నిర్ఘాంతపోతూ చూసింది. అతనలా ఆవిడని పేరుతొ ప్రస్తావించడం ఆమెకి ఎబ్బెట్టుగానిపించింది.

అతను వెంటనే తమాయించుకుని అన్నాడు."అదే! మా పిన్ని వస్తుంది. తను నీకూ, నాకూ కూడా తోడు. సరేనా! తలుపేసుకో! నేను వెళ్తున్నాను."

మరోమాటకి అవకాశం ఇవ్వకుండా గుమ్మం దగ్గరకు నడిచాడు.

ఒకే ఒక క్షణంలో కలిగిన అనేక ప్రశ్నలకి సమాధానం అడిగేలోపే అతని కారు వెళ్ళిపోయింది.

బొమ్మలా ద్వారబంధాలు పట్టుకుని నిలబడిపోయిన పవిత్ర, కొన్ని క్షణాల తరవాత తలుపు మూసి, తూలుతూ వెళ్లి సోఫాలో కూలబడింది.

చెప్పలేని భయంతో ఒళ్లంతా జలదరించింది.

వెంకటమ్మ చెప్పింది నిజమా? శివ మంచివాడు కాదా? సరళకీ అతనికీ ఉన్న సంబంధం ఎలాంటిది? వాళ్ళది సంబంధమా? చుట్టరికమా?

రేపు ఆవిడ వచ్చాక ఎలా ఉంటుంది? తను ఆ ఇంటికి వచ్చిన రోజు నుంచీ, దాదాపు పదిరోజుల దాకా ఉంది. అప్పుడు కూడా శివతో ఎంతో చనువుగా, సరదాగా ఉంది. అప్పుడు ఆమె భర్త కూడా ఉన్నాడు. ఆయన కూడా శివతో ఎంతో బాగా మాట్లాడాడు. ఆవిడ తనని ఎంతో ప్రేమగా చూసుకుంది. బాధ్యతగా కూడా చూసుకుంది. ఇప్పుడు ఎలా చూసుకుంటుంది? అసలు శివ ఎలా ఉంటాడు తనతో? ఇలాగే ఉంటాడా?

వెంకటమ్మ మాటలు చెవుల్లో ప్రతిధ్వనించాయి. "ఆల్లిద్దరిదీ మంచం బందం...మిమ్మల్ని వదిలి నేనేల్లను... మీరు తిట్టినా సరే. నా బిడ్డ లాంటివారు. మీకు ఏదన్నా గోరం జరిగితే ఎవరు కాపాడతారు?"

ఒక పనిమనిషికి తన మీద అంత శ్రద్ధా, ప్రేమా ఎందుకుంటాయి? నిజం చెప్తోందా? అబద్ధం చెప్తోందా? అబద్ధం చెప్పాల్సిన అవసరం ఏం ఉంది? వెంకటమ్మ పెద్దది, పిల్లలున్నారు. ఒక తల్లిగా తనలాంటి వాళ్లకి సాయం చేయడం తప్ప హాని చేయదు.

ఎలాంటి అపకారం జరుగుతుందని వెంకటమ్మ భావిస్తోంది!

పవిత్రకి మతిపోతున్నట్టు ఉంది. ఏది నిజం? ఏది అబద్ధం? అర్థం కావడంలేదు.

"మెరిసేదంతా బంగారం కాదు మనకి మంచిగా కనిపించిన వాళ్ళంతా మంచాళ్ళని ఎలా అనుకుంటాం?" అంటూ ఉండేది నానమ్మ. శివ అలాంటివాడా? నానమ్మకి పని లేదు ఎప్పుడూ ఏవో సామెతలు చెబుతూ ఉంటుంది అని విసుక్కునేది తను.

ఇప్పుడు ఎందుకో ఆ సామెత పదే, పదే గుర్తొస్తోంది.

పవిత్ర ఆలోచనల్లో ఉండగానే, సాయంత్రం పనికి వెంకటమ్మ రానే వచ్చింది.

వస్తూనే చక,చకా అంట్లు తోమేసి, "మీకేమన్నా సాయం చేయమంటారా?" అని అడిగింది.

"నిజం చెప్పు నా భర్త మంచివాడు కాదా?" అనేమాట నోటిదాకా వచ్చింది. కానీ, అలా అడిగి తన భర్తని తానే కించపర్చుకోడం పద్ధతి కాదు అని వివేకం హెచ్చరించడంతో "ఏమి వద్దు" అంది.

వెంకటమ్మ పవిత్ర మొహంలో వచ్చిన మార్పు గమనించిన దానిలా నవ్వుతూ అంది. "బయపడమాకండి. నేనుండేది రెండు బజార్ల అవతల. అక్బర్ కిళ్ళీ కొట్టు పక్కన సందులో నాలుగో ఇల్లు. ఏదన్నా అవసరం వస్తే కేకేయండి వచ్చేస్తాను."

పవిత్ర అవును, కాదు అన్నట్టు అడ్డదిడ్డంగా తల ఊపింది. వెంకటమ్మ వెళ్ళిపోయింది.

వెంకటమ్మ వెళ్ళిపోయాక అన్యమనస్కంగానే కొంతసేపు గడిపి, స్నానం చేసి, తెల్లని వాయిల్ చీర కట్టుకుంది.

అద్దంలో మొహం చూసుకుంటూ అనుకుంది."లేదు శివ అలాంటివాడు కాదు. నన్ను ఎంతో ప్రేమించాడు. ఈ కళ్ళంటే ఎంత ఇష్టం! ఈ పెదాలు..." మొదటిరోజు తన పెదాలు తాకుతూ అతనన్న మాటలు గుర్తొచ్చాయి.

"ఇవి పెదవులు కాదు...మధువనాలు...ఎన్నెన్ని పూలనుంచి తీసుకొచ్చిన మకరందం ఈ పెదాల్లో దాచాడో ఆ బ్రహ్మ."

దశమి చంద్రుడు మెల్లగా ఆకాశాన్ని ఆక్రమించినట్టు, ఒక సిగ్గు తెర ఆమె కళ్ళల్లో చెంపల్లో పాకుతూ పెదవుల మీద మందహాసమై స్థిరపడింది.

"ఛ నాకసలు బుద్ధిలేదు. శివ ఎంత మంచివాడు. చెప్పుడు మాటలు వినకూడదు" అనుకుంటూ, అద్దం ముందు నుంచి కదిలి వంటగదిలోకి వెళ్లి కాఫీ కలుపుకుని వచ్చి, వీధి తలుపు తీసి, సోఫాలో కూర్చుని, వీధిలో తిరుగుతున్న జనాన్ని చూస్తూ కాఫీ సిప్ చేయసాగింది.

కాఫీ తాగడం పూర్తి చేసి, టైం చూసింది. ఆరున్నర దాటుతోంది.

ఈ పాటికి వచ్చేయాలే. రాగానే, " రెడీ అవు బయటకి వెళ్దాం" అంటాడని రెడీగా కూర్చుంది. కానీ ఏడున్నర దాటుతున్నా అతను రాలేదు.

చీకటి పడేసరికి వీధి కొంచెం నిర్మానుష్యంగా మారింది. అడపాదడపా కార్లు, స్కూటర్ లు వెళ్తున్నాయి.

ఇరుగుపొరుగు కూడా ఎవరూ కనిపించడం లేదు. దూర, దూరంగా ఉన్నాయి ఇళ్ళు. ఎవరితోనైనా స్నేహం చేసుకోవాలి రేపు అనుకుంది.

ఇంట్లో ఒక పుస్తకం లేదు, టి వి లేదు. రేడియో లేదు. కాలక్షేపానికి ఏమి లేవు. ఒక్కసారి గుడివాడ వెళ్లి, వస్తూ, వస్తూ తన పుస్తకాలు తెచ్చుకుంటే, చదువు కంటిన్యూ చేయచ్చు కదా! శివ ఆరోజు అన్నాడు కూడా "పెళ్లి అయ్యాక నువ్వు

చదువుకుని కనీసం డిగ్రీ పూర్తి చేయాలి. లేకపోతే నలుగురిలో నాకు బాగుండదు. మీ ఆవిడ కనీసం గ్రాడ్యుయేట్ కాదా అని అడుగుతారు నా తోటి డాక్టర్స్" అని.

నానమ్మ, అమ్మ రావడం ఎందుకు అన్నాడు కానీ, తనని వెళ్ళద్దు అనడేమో! రేపు ఆవిడ రాగానే తను రెండు రోజులన్నా వెళ్ళాలి. ఎలాగా ఆవిడ ఉంటుంది కాబట్టి, ఆయనకీ తిండికి ఇబ్బంది ఉండదు.

ఒక్కసారి ఒళ్ళు జలదరించింది. వెంకటమ్మ చెప్పినట్టు వాళ్ళిద్దరి మధ్యా తనూహించని సంబంధం ఉంటె! అమ్మో! అలాంటప్పుడు వాళ్ళని ఏకాంతంగా వదిలి ఎలా వెళ్ళగలదు?

తెలియని భయం ఒళ్లంతా పాకింది. వీధి గడియ పెట్టింది.

ఆకలేస్తోంది. వంట గదిలోకి వెళ్లి చూసింది. మధ్యాహ్నం వండిన వంట ఇద్దరికీ ఈ పూటకి సరిపోతుంది. వచ్చేస్తాడుగా. వచ్చాక ఇద్దరం తినచ్చు కదా! అనుకుని, అరటిపండు తీసుకుని తిన్నది.

పెరటి తలుపు కూడా వేసి, వెళ్ళిపోయి బెడ్ మీద వాలింది.

అలసట అప్పుడు తెలిసింది. అది శారీరకంగా వచ్చిన అలసటో, రకరకాల ఆలోచనలతో కలిగిన మానసిక ఒత్తిడో కానీ పడుకోగానే నిద్ర పట్టేసింది.

తలుపు చప్పుడుకి మెలకువ వచ్చి, గబుక్కున లేచి, గోడ గడియారం చూసింది. పది చూపిస్తోంది.

శివ వచ్చాడా? అయ్యో మెలకువ రాలేదు. ఎంతసేపటి నుంచి తలుపు కొడుతున్నాడో! గబగబా వెళ్లి తలుపు తీసింది.

"ఇంతసేపైంది ఏంటి? ఏం చేస్తున్నావు?" అడిగాడు.

"సారీ నిద్రపట్టేసింది" అంది.

" వేళకాని వేళ నిద్రేంటి?" కొంచెం చిరాగ్గా అంటూ, కోటు విప్పి ఆమె చేతికిచ్చాడు.

"ఏమి తోచలేదు. చదువుకోడానికి బుక్స్ లేవు, కనీసం మీ దగ్గర రేడియో కూడా లేదు. ఉంటె పాటలు వినేదాన్ని." అంది.

అతను మాట్లాడలేదు. నిశ్శబ్దంగా గదిలోకి వెళ్ళిపోయాడు.

పవిత్ర కోటు కుర్చీమీద వేసి, వంటగదిలోకి వెళ్ళింది.

అతను నైట్ డ్రెస్ వేసుకుని వచ్చేలోగా డైనింగ్ టేబుల్ మీద అన్నీ సిద్ధం చేసింది.

అతను బైటికి వచ్చి, "ఏంటి? ఇంకా నువ్వు డిన్నర్ చేయలేదా?" అన్నాడు.

"అప్పుడేనా? మీరు రాకుండా ఎలా తింటాను?" అంది.

"నేను తినేసి వచ్చాను. నువ్వు త్వరగా తిని వచ్చేయి నాకు నిద్రవస్తోంది"అన్నాడు బెడ్ రూమ్ లోకి నడుస్తూ.

"తిన్నారా? ఎక్కడ?"

అతను సమాధానం చెప్పకుండా వెళ్ళిపోయాడు.

పవిత్రకి తినాలనిపించలేదు. అన్నిటిమీదా మూతలు పెట్టేసి, లైట్స్ అన్నీ ఆర్పేసి, గదిలోకి వెళ్ళింది.

అప్పటికే అతను మంచం పై పడుకుని ఆమెకోసం ఎదురు చూస్తున్నాడు. గదంతా సిగరెట్ వాసన నిండిపోయింది.

ఆమె పక్కకి చేరగానే మీద చేయి వేసి తనకి దగ్గరగా జరుపుకున్నాడు.

సిగరెట్ వాసనతో పాటు ఇంకేదో వాసన మిళితమై కడుపులో తిప్పుతోంది. బలవంతంగా సహకరించింది. కాసేపట్లోనే అతను పక్కకి తిరిగి నిద్రపోయాడు.

అంతకు ముందే గాఢ నిద్ర నుంచి లేచిందేమో, చాలాసేపు నిద్రపట్టలేదు పవిత్రకి. ఆలోచనలు...ఆలోచనలు. కందిరీగల్లా ముసురుకుంటున్నాయి. అర్ధరాత్రి ఎప్పుడో కళ్ళు మూసుకుంది

కాపురానికి వచ్చిన ఈ ఇరవై రోజుల్లో ప్రతిరోజు అతనిలో ఓ కొత్త రూపం కనిపిస్తూనే ఉంది ఆమెకి. కాకపోతే ఆ రూపానికి ఏ పేరు పెట్టాలో అర్థం కాలేదు.

ప్రేయసిగా ఉన్న రోజుల్లో "అండి గిండీ ఏంటి? ప్రేమగా శివా! అని పిలువు" అంటూ ఒకటికి నాలుగుసార్లు అలా పిలిపించుకుని మురిసిపోయిన మనిషే, పెళ్లి అయిన నాలుగోరోజు "మొగుడ్ని పేరు పెట్టి పిలవడం సంప్రదాయం కాదు..." అని సెలవిచ్చాడు. ఆరోజు ఏదో ఒక నాటికి ఈ ప్రేయసి భార్య అవుతుందని తెలియదా? అలా అయ్యాక ఏకవచన సంబోధన ఉండకూడదని తెలియదా?

ఏది మాట్లాడినా, ఈ మాట తన భార్య మనసుకి ఎలా తాకుతుంది అనే ఆలోచన లేదన్న విషయం అర్థం అవుతోంది. భార్యని నొప్పించకూడదు అన్న సిద్ధాంతం లేదు అతనికి. నవ్వుతూనే అన్నా కొన్ని మాటలు గుండెని సూటిగా తాకుతున్నయి.

ఆమెకి మెలకువ వచ్చేసరికి అతను పక్కన లేడు. కళ్ళు తెరిచి గడియారం చూసింది. ఏడు అయింది. గబుక్కున లేచి, బయటకు నడిచింది. అతని జాడ కనిపించలేదు. వీధి తలుపు మూసే ఉంది.

ఎక్కడికి వెళ్లి ఉంటాడు? మార్నింగ్ వాక్ కి కానీ వెళ్ళాడా?

తలుపులు మూసి ఉన్నాయి కదా ఎలా వెళ్తాడు?

ఆలోచిస్తూనే బ్రష్ చేసుకుని, కాఫీ డికాషన్ వేస్తూ ఉండగా కారు శబ్దం అయింది. వెంటనే తలుపు చప్పుడు అయింది.

చేతిలో హ్యాండ్ బాగ్ తో సరళ, ఆమె వెనక సూట్ కేసుతో శివ వచ్చారు.

నోట మాటలేకుండా చిత్తరువులా నిలబడి చూస్తున్న పవిత్రతో అన్నాడు శివ. "స్టేషన్ కి వెళ్ళాలి అని చెప్పానుగా రాత్రి. నిన్ను లేపడం ఎందుకని బయట తాళం వేసుకుని వెళ్ళిపోయాను.

"హాయ్! ఎలా ఉన్నావు? కొత్త కాపురం భలే ఉన్నట్టుందే! బుగ్గలు యాపిల్స్ లా అయాయి. కొరికేయాలనిపిస్తోంది" అంటూ పవిత్ర రెండు బుగ్గలూ ముద్దు పెట్టుకుంది.

పవిత్రకి సిగ్గేసింది.

"కాఫీ ఇస్తాను" అంటూ వేగంగా కిచెన్ లోకి వెళ్ళింది.

ఆవిడ గట్టిగా నవ్వి, "మీ ఆవిడకి సిగ్గెక్కువే ఉన్నట్టుంది. ఉండాలిలే. కొత్త పెళ్లి కూతురు కదా, ఈమాత్రం లేకపోతే బాగుండదు." అంది శివతో.

శివ ఏమన్నాడో వినిపించలేదు. ఇద్దరూ గట్టిగా నవ్వుకోడం మాత్రం వినిపించింది.

పవిత్ర అందరికీ కాఫీ ఇచ్చేసి, తనూ తాగి, ఉప్మాకి పచ్చిమిర్చి, అల్లం తరుక్కోడానికి వెళ్ళిపోయింది.

సరళ గలగల మాట్లాడుతూనే ఉంది. శివ కూడా ఆవిడతో స్వరం కలుపుతున్నాడు. వాళ్ళిద్దరూ అంతగా ఏం మాట్లాడుకుంటున్నారో పవిత్రకి తెలియలేదు. ఏముంటాయి వాళ్ళ మధ్య అంత మాట్లాడుకోడానికి? ఆలోచిస్తూనే ఉప్మా చేసింది.

సరళ స్నానం చేసి వచ్చింది. చుడీదార్ వేసుకుంది. నల్లని పూలున్న, పసుపు పచ్చ కుర్తీ. ఆవిడ వయసు ఎంతో గానీ, పల్చని పొట్ట, చక్కని ఫిగర్ తో కాలేజీ చదువు పూర్తి చేసుకున్న అమ్మాయిలా ఉంది. మొదటి రోజు పెళ్ళిచూపుల్లో చూసిన సరళకి, పెళ్ళిలో చూసిన సరళ కి, ఇప్పుడు చూస్తున్న సరళకీ చాలా తేడా ఉంది.

పవిత్ర టేబుల్ మీద ప్లేట్స్, మంచి నీళ్ళ గ్లాసులు సర్దింది. వేడి, వేడి ఉప్మా తీసుకొచ్చి వడ్డించింది. శెనగపప్పు పచ్చడి చేసింది.

సరళ, శివ మాట్లాడుకుంటూనే వచ్చి, పక్కపక్క కుర్చీల్లో కూర్చున్నారు.

పవిత్రకి చివుక్కుమనిపించినా పెద్దగా పట్టించుకోలేదు .

"అబ్బో ఉప్మా బాగుందే! నీకు వంట బానే వచ్చనమాట. మరేంటి శివా! తనకి వంట చేతకాదు అని చెప్పావు." అంది సరళ.

"నేర్పించా" అన్నాడు శివ.

పవిత్ర శివ వైపు చూసింది. సరదాకి అంటున్నాడా? గొప్ప చెప్పుకుంటున్నాడా? ఉప్మా అమ్మ చేస్తుంటే చూసి తను నేర్చుకుంది. కొన్ని ఐటమ్స్ తనంతట తనుగా ఇష్టంతో నేర్చుకుంది అమ్మ దగ్గర.

ఆమె చూపులు సరళకానీ, శివ కానీ గమనించలేదు. ఏవో జోక్స్ వేసి నవ్వుకుంటున్నారు.

పవిత్రకి ఆ పరిస్థితి ఇబ్బందిగా అనిపించింది.

టిఫిన్ తినడం అయిపోయాక, శివ రెడీ అవడానికి రూమ్ లోకి వెళ్ళగానే పవిత్ర అతని వెనకాలే వెళ్లి "నాకు వంట రాదు కదా! ఆవిడ చేస్తారా?" అనడిగింది.

శివ ఆమెవైపు ఓ క్షణం చూసి, "నేను, సరళ బయటకి వెళ్తున్నాం. నువ్వు నీకేం కావాలో చేసుకో" అన్నాడు.

"బయటకి వెళ్ళడం అంటే హోటల్ లో తింటారా? అలాంటప్పుడు నేనూ రావచ్చుగా".

సరళ లోపలికి వచ్చి, "నువ్వు వచ్చే చోటికి మేమే తీసుకుని వెళ్తాము...ఇది నువ్వు వచ్చే ప్లేస్ కాదు" అని చెప్పి, డ్రెసింగ్ టేబుల్ దగ్గరకు వెళ్లి దువ్వెన తీసుకుని వచ్చి, మంచం చివర కూర్చుని,"ఇటురా" అంది శివతో.

శివ ఆవిడ కాళ్ళ దగ్గర మోకాళ్ళ మీద కూర్చున్నాడు.

ఆవిడ శివ క్రాఫ్ దువ్వుతూ పవిత్రని ఉద్దేశించి అంది" శివకి నేను దువ్వితే ఇష్టం. చిన్నప్పటి నుంచి అలవాటు అయింది."

పవిత్ర వాళ్ళిద్దరినీ అయోమయంగా చూడసాగింది. ఆవిడ దువ్వడం పూర్తి చేసి, "వెళ్ళు హీరో చూసుకో అద్దంలో " అంది నవ్వుతూ.

శివ లేచి నిలబడి, "నువ్వు దువ్వితే ఆ అందమే వేరులే. పద, పద... టైం అయింది." అన్నాడు గదిలో నుంచి బయటకు నడుస్తూ.

సరళ కూడా అతని వెనకాల వెళ్తూ, "సాయంకాలం దాకా నిద్రపో" అని పవిత్ర చెంప మీద చిటికె వేసింది.

వాళ్ళిద్దరూ వాకిలి దగ్గరకు వెళ్తూ ఉండగా వెంకటమ్మ లోపలికి వచ్చింది.

సరళ ని చూడగానే ఆమె మొహం చిట్లించుకోవడం పవిత్ర గమనించింది.

సరళ కూడా వెంకటమ్మని చూడగానే నిర్లక్ష్యంగా వెళ్ళిపోయింది.

వాళ్ళిద్దరూ వెళ్ళిపోగానే వెంకటమ్మ పవిత్ర వైపు చూసింది. అప్పుడే తలతిప్పి ఆమెని చూసింది పవిత్ర. వెంకటమ్మ కళ్ళల్లో ఆమె పట్ల జాలి కనిపించింది.

"శనిలా దాపరించింది. ఇదెప్పుడు వదుల్తాదో" అంటూ సింక్ లో ఉన్న గిన్నెలు ప్లాస్టిక్ టబ్ లో సర్దుకోసాగింది వెంకటమ్మ.

పవిత్రకి ఆ సన్నివేశం చాలా అవమానకరంగా అనిపించింది. ఒక పని మనిషి ఎదురుగా తన భర్త మరో స్త్రీతో సన్నిహితంగా ఉండడం తనకి అవమానం కదా!

ఇది ఎలా పరిణమిస్తుంది? తన జీవితం ఎలా గడవబోతోంది. తెలివితక్కువగా శివ ట్రాప్ లో పడి జీవితాన్ నాశనం చేసుకుందా?

నిస్సత్తువగా డైనింగ్ టేబుల్ దగ్గర కుర్చీలో కూలబడింది.

ఏడుపు తన్నుకొస్తోంది. "నానమ్మా!" అనుకుంది ఆవేదనగా.

వెంకటమ్మ చీపురు తీసుకుని వచ్చి, వదలిన పూలదండలా కుర్చీలో వేళ్ళాడుతున్న పవిత్ర దగ్గరగా నడిచి, ఆమె తల మీద చేయి వేసి అంది "బయపడమాకమ్మా. నువ్వు ఊ అంటే చీపురు తిరగేసి దాన్ని ఎనక్కి పంపేత్తాను... తిరిగి ఇటువైపు రాడానికి వణికిపోవాల" అంది.

పవిత్ర మాట్లాడలేదు.

"తాళి కట్టించుకున్నావు. ఇప్పుడు చేసేది ఏమిలేదు. జాగర్తగా ఉంటూ, ఆల్లిద్దరినీ ఒక చోట చేరకుండా చూసుకో. నువ్వు అంటీ, ముట్టనట్టు ఉన్నావనుకో... నాలుగు రోజులుండి ఆమెనే పోతుంది." అంది.

పవిత్ర తల ఎత్తి ఆమె మొహం లోకి చూస్తూ జాలిగా అడిగింది. నువ్వు చెప్పేది నిజమేనా? ఆవిడ ఆయనకీ పిన్ని అవుతుంది కదా!"

"పిన్నా! గాడిదగుడ్డా? అదంతా పెద్ద కత... నేనూ విన్నదే చూసింది కాదు. మీ ఆయనకీ ఎవరూ లేరు. అనాదగా పెరిగాడు. ఈ సర్లమ్మ, ఆమె గారి భర్తా, పిల్లలు లేరని, ఈ కుర్రాడికి పన్నెండేళ్ళు ఉన్నప్పుడు తెచ్చుకున్నారు. ఎవరన్నా పసిపిల్లల్ని తెచ్చుకుంటారు. మరి వీల్లేమిటో పెద్దవాడిని తెచ్చుకున్నారు." అటూ ఇటూ చూసి, కొంచెం ఒంగి చెవిలో రహస్యం చెబుతున్నట్టు చిన్నగా చెప్పింది "ఆమె బర్త మగోడు కాదంట."

పవిత్ర చెవులు రెండు చేతులతో మూసుకుని, "నాకేం చెప్పకు. కడుపులో తిప్పుతోంది". అంటూ గబుక్కున లేచి బాట్ రూమ్ లోకి వెళ్ళింది.

లోపల నుంచి వాంతి చేసుకుంటున్న శబ్దం విని, వెంకటమ్మ ఆందోళనగా అటు వెళ్ళింది.

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS